క్లుప్తంగా

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరు: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలోని సత్యసాయి ధ్యాన మందిరంలో మహిళా చట్టాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన కలిగిఉంటే స్వయంగా కోర్టు ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. 498/ఏ గృహ హింస, మెయింటెనెన్స్ తదితర కేసులపై అవగాహన కల్పించారు., కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీధర్, సుదర్శనం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమార్, మెప్మా సూపర్‌వైజర్ హుస్సేన్‌బీ, ఎస్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భ్రమరాంబకు ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీభ్రమరాంబాదేవికి ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఊయలసేవను అర్చకులు వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 7 గంటల తరువాత ప్రారంభమైన ఊయల సేవ లో భాగంగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. కా ర్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల మూర్తులను వేంచేయింపజేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామ పూజలు చేశారు.

పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవ మూర్తులకు సోమవారం శుద్ధ పౌర్ణమి సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులుగావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలుచేసి,మేళతాళాలతోఆలయ ప్రదక్షిణ చేశారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



డ్రైనేజీ పనులు జరుగుతున్న దృశ్యం

పాములపాడు:మండలంలోని తుమ్మలూరు గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరు గుతున్నాయి. సోమవారం భాగంగా డ్రైనేజీ నిర్మాణానికి కాంక్రీటు పనులు జరిగాయి. గ్రామంలోని అంతర్గత వీధుల్లో వర్షాకాలంలో వర్షపు నీరు ఎక్కడ పడితే అక్కడ నిలిచి చిత్తడిగా మారుతుండేది. ఈగలు, దోమల బాధను భరించలేకుంటున్నామని ప్రజలు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌కు ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ గోడు వెళ్లిబుచ్చారు. ఈ మేరకు సచివాలయానికి మంజూరైన నిధులు రూ. 20లక్షలతో వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు పనులు ప్రారంభించారు. జెడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి చొరవతోనే గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పశువులకు టీకాలు తప్పని సరి



ఎద్దుకు టీకా వేస్తున్న డాక్టర్ భాస్కర్

పాములపాడు:పశువులకు గాలి కుంటు వ్యాధి టీ కాలు తప్పని సరిగా వేయించాలని డాక్టర్ భాస్కర్ అన్నారు. సోమవారం మండలంలోని బానకచెర్ల గ్రామంలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. 100 ఎద్దులు, 120 గేదె లు, 80 దూడలకు ఉచిత టీకాలు వేశారు. పాడి రైతులు పశువుల పట్ల నిర్లక్ష్యం చేయరాదన్నారు. గాలికుంటు వ్యాధి సోకితే గేదెల్లో పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. ఎద్దుల్లోపని సామర్థ్యం తగ్గుతుందని, దూడలు మృత్యువాత పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో వీఎల్ఓ తిరుపతమ్మ, ఏహెచ్ఏ మనీష్, ప్రసన్న, గోపాల మిత్ర భాస్కర్, శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సాధికారిత సాధించాలి

ఆత్మకూరు: మహిళలు అన్ని రంగాల్లో సాధికారిత సాధించాలని అయుర్వేద వైద్యాధికారి లావణ్య, రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ రాజేశ్వరమ్మ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లావణ్య, రాజేశ్వరి, మహిళ అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య, మహిళా సాధికారిత విభాగం కో ఆర్డినేటర్ తిరుపతమ్మ , సుమిత్ర, సోఫియా తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డికి డిమాండ్

- అత్యధికంగా ప్రకాశం జిల్లాకు తరలివెళ్తున్న పశుగ్రాసం
- ట్రాక్టర్ గడ్డి రూ.6 వేల నుంచి రూ. 8 వేలు
- ఆనందంలో అన్నదాతలు



ట్రాక్టర్‌లో తరలివెళ్తున్న పశుగ్రాసం

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో ఈ ఏడాది రబీలో రైతులు సాగు చేసిన వరి పశుగ్రాసానికి మంచి డిమాండ్ ఏర్పడింది. ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఈ ఏడాది రబీలో వరి పంటను అధికంగా సాగు చేయగా ప్రస్తుతం పంట నూర్పిళ్లు చేస్తున్నారు. ఇక్కడి నుంచి ప్రకాశం జిల్లా వాసులు అధికంగా కొనుగోలు చేసి తీసుకెళ్తుండటంతో మంచి ధర పలుకుతుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎకరా నుంచి 10 ఎకరాల దాకా కొనుగోలు

డివిజన్ పరిధిలో ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు మండలాలతో పాటూ నియోజకవర్గ పరిధిలోని బండి ఆత్మకూరు, మహానంది మండలాలలో విస్తారంగా వరి పంటను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట కోత దశకు రావడంతో రైతులు పంటను నూర్పిడి చేస్తున్నారు. ఈ దశలో ప్రకాశం జిల్లా పరిధిలోని దోర్నాల, మంతనాల, మార్కాపురం తదితర ప్రాంతాలకు ఆత్మకూరు నుంచి వరి గడ్డి తీసుకువెళ్లడంతో డిమాండ్ పెరిగింది. వరిగడ్డిని ఎకరా నుంచి 10 ఎకరాల దాకా ఆ ప్రాంత వాసులు కొనుగోలు చేస్తున్నారు. దీనికితోడు స్థానిక రైతుల నుంచి డిమాండ్ ఉండడంతో వరి గడ్డికి పోటీ ఏర్పడింది.

ఖరీఫ్ కంటే రబీ పశుగ్రాసానికే మంచి డిమాండ్

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన వరి గడ్డి కంటే రబీలో సాగు చేసిన గ్రాసానికి మంచి డిమాండ్ ఉంది. వర్షాకాలం వరిగడ్డి తడిసిపోవడంతో పశువులకు సరిగా ఉపయోగపడకపోవడంతో ఖరీఫ్‌లో పండించిన గ్రాసం కొనుగోలుకు పాడిరైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. రబీలో సాగు చేసిన వరి గడ్డి నాణ్యతగా ఉండడంతో పశువులకు గ్రాసంగా బాగా ఉపయోగపడుతుంది. ఫలితంగా రబి సీజన్‌లోని గడ్డికే మంచి డిమాండ్ ఏర్పడింది.

కూలీలతో కోతల వల్లే పెరిగిన ధర

డివిజన్ పరిధిలో అన్ని మండలాల్లో వరిని సాగు చేసిన రైతులు కూలీలతో కోత కోయించడం వల్లనే గడ్డి ధర విపరీతంగా పెరిగింది. సాధారణంగా వరి పంటను యంత్రాలు కాకుండా కూలీలను ఉపయోగిస్తే గడ్డి ఎలాంటి నాణ్యత కోల్పోకుండా పశువులకు మేత వేసేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మిషన్లు ఉపయోగించడం వలన గడ్డి ముక్కలుగా అయిపోతుంది. ఈ గడ్డిని కొనుగోలు చేయడానికి రైతులు ఆసక్తి చూపకపోవడంతో కూలీల ద్వారా కోత కోసిన వరినే మొగ్గుచూపుతున్నారు. ఫలితంగా పశుగ్రాసం మంచిధర పలుకుతుంది. ప్రస్తుతం ట్రాక్టర్ గడ్డి ఎకరాకు రూ.6వేల నుంచి రూ.8 వేల దాకా ధర ఉంది. ఆత్మకూరు, పాములపాడు లాంటి మండలాలకు వివిధ గ్రామాల నుంచి తరలించేందుకు ట్రాక్టర్‌కు రూ. 2వేల నుంచి 3 వేల వరకు, వ్యవసాయ కూలీలు రూ.2 నుంచి 3 వేల వరకు ఖర్చవుతుండటంతో వరిగడ్డి ధర భారీగా పెరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఆత్మకూరులో కొనుగోలు చేసి ప్రకాశం జిల్లాకు తీసుకెళ్లే వరకూ రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకు ఖర్చు అవుతున్నట్లు అక్కడి పశుపోషకులు, వ్యాపారులు చెబుతున్నారు.

కూలీలు కోసిన గడ్డినే కొంటున్నారు



వరి పంట కోత దశలో ఉండడంతో కూలీలు దొరకక పోవడంతో రైతులు ఎక్కువగా యంత్రాలు ఉపయోగిస్తున్నారు. యంత్రాల వలన గడ్డి చేతికి రాకపోవడంతో పాటూ పశువులు మేత మేసేందుకు ఉపయోగకరంగా ఉండదు. దీంతో అన్నదాతలు కూలీల ద్వారా కోత కోసిన గడ్డిని కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా వరిగడ్డి ధర పెరిగింది.

–అబ్దుల్‌కలాం, ఆత్మకూరు

యంత్రాలతో కోసిన గడ్డిని పశువులు తినవు



యంత్రాల ద్వారా కోతకోసిన వరిగడ్డిని పశువులు మేయడం లేదు. ఇందువలన యంత్రాల ద్వారా వచ్చిన గడ్డిని కొనడం మానుకున్నాం. కేవలం కూలీల ద్వారా కోసిన గడ్డిని మాత్రమే కొనుగోలు చేస్తున్నాం. పశువులకు మేత లేకుండా ఖాళీ కడుపుతో ఉంచలేం. ఎక్కువ ధర ఉన్నప్పటికీ కొనుగోలు చేసి పశువులకు వరిగడ్డిని ఉపయోగిస్తున్నాం.

– ఎలిషా ,వెంకటాపురం

9 నుంచి ఉప్పలదడియ ఉరుసు

మిడుతూరు: మండల పరిధిలోని ఉప్పలదడియ గ్రామంలో 9వ తేదీ నుంచి శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ సుల్తాన్‌షా ఖాద్రి షర్ఫి స్వాముల వారి ఉరుసు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం రాత్రి 10 గంటలకు గంధం, 10వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జండాలు ఎక్కించడం, రాత్రి 9 గంటలకు ఖవ్వాలి ఉంటుందన్నారు. భక్తులు ఉరుసు మహోత్సవంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఉరుసు మహోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు 10వ తేదీ ఉదయం దర్గా మైదానంలో నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. 9వ తేదీ లోపు ఎంట్రీఫీజు రూ. 500 చెల్లించి ఆసక్తి కలవారు జట్టుపేరు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో విజేత జట్లకు మొదటి, రండో, మూడవ, నాల్గవ స్థానాల్లో వరుసగా రూ.15,016, రూ.10,016, రూ.5,016, రూ.3,016 నగదును అందజేస్తామన్నారు.

గ్రంథాలయాభివృద్ధిలో భాగస్వాములవ్వండి

కొత్తపల్లి: స్థానిక గ్రంథాలయాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు అవ్వాలని లైబ్రేరియన్ కౌసల్య పిలుపునిచ్చారు. సోమవారం ఆమె గ్రామంలోని ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధిలో గ్రామస్థులను భాగస్వాములను చేసేందుకే సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టామన్నారు. పిల్లల భవిష్యత్తుకు పెద్దల సహాయ సహకారులు ఎంతో అవసరమన్నారు.

పెద్ద బండలాగుడు పోటీలు ప్రారంభం



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు: శ్రీమత్కొణిదేల భ్రమరాంబామల్లికార్జున స్వామి తిరుణాల సందర్భంగా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్ర స్థాయి కేటగిరి బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు ఎమ్మెల్యేలకు ఈఓ కార్తీక్, ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పోటీల్లో 10 జతల ఎద్దులు పాల్గొన్నాయి. సాయంత్రం పూర్ణాహుతి, నాగవేణి స్వామి వారి పారువేట ఉత్సవం భక్తులు నిర్వహించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ షేక్ అబ్దుల్ షుకూర్, సింగిల్ విండో చైర్మన్లు హుసేనయ్య, హరిసర్వోత్తమరెడ్డి, గ్రామ సర్పంచ్ నవీన్ బాబు, ఉపసర్పంచ్ భాస్కరరెడ్డి, ఆలయ ధర్మకర్త కిరణ్ కుమార్, టౌన్ సీఐ విజయభాస్కర్, ఎఎస్సారీసీపీ నాయకులు విక్టర్, రత్నస్వామి, మహేశ్వరయ్య, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తర్తూరులో అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు

- వివిధ కేటగిరీల్లో రూ.8.30 లక్షలతో బహుమతులు

జూపాడుబంగ్లా: ఏప్రిల్ 6 నుంచి మూడు రోజులపాటు తర్తూరు శ్రీలక్ష్మీరంగనాధుని జాతరలో రూ.8.30లక్షల బహుమతులతో అంతర్ రాష్ట్ర ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, తర్తూరు దేవాలయ చైర్మన్ ప్రతాపరెడ్డి, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం 80బన్నూరు గ్రామంలోని తర్తూరు ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి ఇంట్లో ఎద్దుల బండలాగుడు పోటీల నిర్వహణపై వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో ఏప్రిల్ 6న అంతర్ రాష్ట్ర సీనియర్స్ విభాగంలో ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు 8 బహుమతులుగా రూ.3.90లక్షల నగదును అందజేస్తామన్నారు. 7న నిర్వహించే అంతర్ రాష్ట్ర న్యూ కేటగిరీ విభాగంలో 8 బహుమతులకు రూ.2.95లక్షలు, 8న నిర్వహించే పాలపండ్ల ఎద్దుల పోటీల్లో 7 బహుమతులుగా రూ.1.45 లక్షల నగదును విజేతలైన ఎద్దుల యజమానులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, సర్పంచులు నాగార్జునరెడ్డి, పీఎం నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సూదిరెడ్డి రమేష్‌రెడ్డి, కోసిక తిరుమలేశ్వరరెడ్డి, కోసిక తరుణ్‌కుమార్‌రెడ్డి, అమరేశ్వరరెడ్డి, నరసింహయాదవ్, విశ్వనాథరెడ్డి, మద్దిలేటి రెడ్డి(నానిరెడ్డి), మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ శివరామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

జూపాడుబంగ్లా: శ్రీవేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పారుమంచాల గ్రామంలో సోమవారం హోమం, కుంభస్థాపన, కుంభారాధన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం పుణ్యాహవచనం, అకల్మషహోమం, పంచగవ్యప్రాసన, రత్నన్యాసం, బింబస్థాపనం కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం అగ్నిప్రతిష్ఠ, కళాపకర్షణం, కుంభస్థాపన, కుంభారాధన, పూర్ణాహుతిలను వేదమంత్రాల మధ్య అర్చకులు నిర్వహించారు.

గ్రామీణ ప్రాంతాల్లోనూ మెరుగైన వైద్యసేవలు



పెద్దగుమ్మడాపురంలో వైద్యసేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు కూడా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తోందని డాక్టర్ జబ్బీర్, 104 వైద్యురాలు సుధాప్రణతి అన్నారు. సోమవారం ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని పెద్దగుమ్మడాపురం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామంలోని ఇంటి వద్దనే వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. గ్రామంలో ద్వారా దగ్గు, జలుబు, ఒంటి నొప్పులు, జ్వరం, బీపీ, షుగర్, తదితర వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు.

సోషల్ ఆడిట్‌కు సహకరించండి

పగిడ్యాల: మండల వ్యాప్తంగా 2021–22 ఆర్థిక సవంత్సరంలో జరిగిన ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ కింద చేపట్టిన సచివాలయ బిల్డింగ్స్, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సామాజిక భద్రత పెన్షన్‌లకు సంబంధించి చేపట్టే సోషల్ ఆడిట్‌కు అధికారులు సమన్వయంతో సహకరించాలని ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 8 గ్రామ పంచాయతీలలో సోషల్ ఆడిట్ బృందం పర్యటించి పనులను భౌతికంగా పర్యవేక్షిస్తారన్నారు. పనులకు సంబంధించిన ఎం.బుక్స్ అప్పగించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ పుల్లయ్య, ఏపీఓ మద్దిలేటి, ఖాసీం సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న మనోహర్‌రెడ్డి

పగిడ్యాల: ఉపాధ్యాయులు సమన్వయ్యంతో పని చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఎంఐఎస్ ప్లానింగ్ కో ఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి, ఏఎస్ఓ దస్తగిరి బాబు సూచించారు. సోమవారం మండలంలోని భవిత కేంద్రం, ఎంఈఓ కార్యాలయం, నెహ్రూనగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేసిన బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల వినియోగంపై ఆరా తీశారు. ట్యాబ్‌లను ఏవిధంగా ఆపరేట్ చేయాలో ఉపాధ్యాయులు సవివరంగా బోధించాలన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల్లోని నైపుణ్యాలకు సానబెట్టాలని సూచించారు. అలాగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధనే ధ్యేయంగా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలన్నారు. విద్యతో పాటు మానవ సంబంధమైన విలువలను నేర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాన్, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులు ఉన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- పట్టణంలో అభివృద్ధి పనుల పరిశీలన
- పనులు వేగవంతం చేయాలని ఆదేశం



ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని సన్మానిస్తున్న ఆత్మకూరు మదరసా కమిటీ సభ్యులు

ఆత్మకూరు: ముస్లింల సంక్షేమానికి అనునిత్యం కృషి చేస్తానని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మదరసా నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ముస్లింలకు కావాల్సిన అభివృద్ధి పనులను ఏ లోటు లేకుండా చేస్తామన్నారు. వెలుగోడు పట్టణంలో ముస్లింల దర్గా, షాదీఖానాల అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. పట్టణంలోని షాదీఖానాను సందర్శించి పనుల్లో పురోగతి లేదని, వేగవంతం చేసి త్వరిత గతిన నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనులు నత్తనడకన సాగితే ఎప్పుడు పూర్తి చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని,సంబంధించిన అధికారులతో చర్చించి పరిష్కరిస్తాన్నారు. అనంతరం నాన్‌అమృత్‌పథకం కింద ప్రారంభమైన భారీ నీటిట్యాంక్‌లను పరిశీలించారు. పక్కాగృహాల లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని, ఉగాది నాటికి అధిక సంఖ్యలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డిని మదరసా కమిటీ సభ్యులు సన్మానించారు. అనంతరం పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయసమీపంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూతన కల్యాణ మండప నిర్మాణానికి ఎమ్మెల్యే శిల్పా భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు అంజాద్‌అలీ, రాజమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు రషీద్, మాజీ చైర్మన్ నూర్‌మహ్మద్, కలిముల్లా, సుల్తాన్, వరాల మాలిక్, తిమోతి, సయ్యద్‌మీర్, పద్మశాలి సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

నందికొట్కూరు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని 11, 26వ వార్డులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే మిడుతూరు, కొత్తపల్లి, మహానంది, ఆత్మకూరు మండలాల్లో జెడ్పీటీసీ సభ్యులు పర్వత యుగంధర్ రెడ్డి, సోమలసుధాకర్ రెడ్డి, కేవీఆర్ మహేశ్వరరెడ్డి, కురుకుంద శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు.

'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మండల జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి సోమవారం తెలిపారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ సరళిపై అవగాహన, సందేహాలను నివృత్తి చేస్తామన్నారు. మండల జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు అందరూ హాజరుకావాలని కోరారు.

9న కొలనుభారతి హుండీ ఆదాయం లెక్కింపు

కొత్తపల్లి:మండల పరిధిలోని శివపురం గ్రామశివారుల్లో నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ కొలనుభారతిదేవి దేవస్థానంలో ఈనెల 9న శాశ్వత హుండీల ఆదాయం లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మోహన్ సోమవారం తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి ప్రజలు, దేవదాయశాఖ వారి పర్యవేక్షణలో భక్తులు అమ్మవారికి సమర్పించిన కానులను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

పాములపాడు: నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు వెంకట రమేష్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుమిత్రమ్మకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ చేతి వృత్తి దారులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలన్నారు. 50 సంవత్సరాలుపై బడిన వారికి నెలకు రూ.5,000 పింఛన్ ఇవ్వాలని కోరారు. చేతి వృత్తి దారులను ప్రభుత్వం గుర్తించి ఇంటి స్థలం , గృహం మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఉపేంద్ర, కృష్ణ, వెంకటేష్, శ్రీరాములు, వెంకటరమణ పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

మహానంది: శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు శరభయ్యశర్మలు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. గోమాతను పట్టువస్త్రాలతో అలంకరించి ఆలయ ప్రాకారంలో వైభవంగా ఉత్సవం చేపట్టారు.

గృహ హింస కేసు నమోదు

పగిడ్యాల: అదనపు కట్నం కోసం కొద్ది రోజులుగా భర్త, అత్త, ఆడపడుచులు మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నారని బాధితురాలు షాజహాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గృహ హింస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్ సోమవారం తెలిపారు. ముచ్చుమర్రి స్టేషన్ పరిధిలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన షాజహాన్ కర్నూలు మండలం జోహరాపురం గ్రామానికి చెందిన షేక్ వలిని 8 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకుంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే గత కొద్ది రోజులుగా భర్త షేక్ వలి, అత్త రసూల్‌బీ, ఆడపడుచు ముబారక్ వేధింపులకు గురి చేసి అదనపు కట్నం తేవాలని ఇంటి నుంచి గెంటివేశారని స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

విషాదం కొనితెచ్చుకోకండి

మహానంది: కొద్దిపాటి ఆనందం కోసం విషాదం కొనితెచ్చుకోవద్దని మహానంది ఎస్ఐ సీసీ నాగార్జునరెడ్డి సూచించారు. నంద్యాల–గిద్దలూరు ఘాట్‌రోడ్డులోని గాజులపల్లె మెట్ట వద్ద సోమవారం రాత్రి డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యంసేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ఏవైనా ప్రమాదాలు జరిగితే కుటుంబ సభ్యులు, పిల్లలకు తీరని నష్టం జరుగుతుందన్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి

జూపాడుబంగ్లా: త్వరలో నిర్వహించనున్న స్థానిక ఎంపీటీసీ, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అభ్యంతరాలుంటే ఈనెల 7లోగా వెల్లడించాలని ఎంపీడీఓ మంజులవాణి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని తర్తూరు గ్రామంలో ఎంపీటీసీ స్థానంతో పాటు 2వ వార్డు, జూపాడుబంగ్లా 7వ వార్డు, తాటిపాడు ఎంపీటీసీ స్థానాలకు త్వరలో ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. వీటికి సంబంధించిన ఎన్నికల నిర్వహణకు గాను పోలింగ్ కేంద్రాల జాబితాను ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రచురించామని చెప్పారు.

ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో స్వల్పకాలిక ఉపాధి కల్పన కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.రవీంద్రబాబు సోమవారం తెలిపారు. టైలరింగ్, గృహోపకరణాలను మరమ్మతులు చేసే ఫీల్డ్ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థులు 8వ తరగతి వరకు చదువుకుని, చదువుమానేసిన, ఇతర విద్యార్హతలు కలిగి ఉన్న 15 నుంచి 45 ఏళ్ల వయసున్నవారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా శ్రీశైలం ఐటీఐలో సమర్పించాలన్నారు. వివరాలకు సెల్ 9440849850, 9705683537, 9440748448, 7382638904 , 9908993910 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వేతనాలు చెల్లించాలి

ఆత్మకూరు:పెండింగ్ వేతనాలు చెల్లించాలని పారిశుద్ధ్య కార్మికులు సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించా రు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకుడు శీలం శేషు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు 9 నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ కల్యాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు శేఖర్, వెంకట్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఐడీ కార్డుతో పాటు ఆధార్ కార్డు తీసుకెళ్లాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్పెషలాఫీసర్

బండిఆత్మకూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఓటు వేసే ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు తప్పనిసరిగా ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు కార్డులతో పాటు ఆధార్ కార్డులను తమవెంట తీసుకెళ్లాలని మండల స్పెషలాఫీసర్ రాజశేఖర్, ఎంపీడీఓ వాసుదేవ గుప్తా తెలిపారు. సోమవారం బండిఆత్మకూరులోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ ఆత్మకూరులోని ఆర్డీఓ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం కోసం జరిగే ఎన్నికకు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంధులు, నిరక్షరాస్యులు, అంగవైకల్యం ఉన్న వారు తమవెంట మరొకరిని తీసుకెళ్లవచ్చన్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తును పూర్తి చేసి ఈ నెల 10వ తేదీలోగా కర్నూలులోని జాయింట్ కలెక్టరుతో అనుమతి పొందాలన్నారు.